సాక్షి మెదక్

శుక్రవారం । 5 । జూలై । 2024



65 ఏళ్లు దాటితే ఇంటికే..

65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 8లో ▶



సాగు భూములకే 'రైతు భరోసా'

పారదర్శకంగా రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు డీఏఓ గోవింద్ తెలిపారు.

వివరాలు 9లో ▶

రేపు జాబ్ మేళా

సిద్దిపేటజోన్: ఎమ్మెస్ఎన్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఈనెల 6న స్థానిక ప్రతిభ డిగ్రీ పీజీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ల్యాబ్స్ ప్రతినిధి మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ కెమిస్ట్రీ చదివిన పురుషులు ఉదయం 10 గంటలకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఉద్యమ కెరటం దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చే వ్యక్తి దొడ్డి కొమురయ్యేనని అన్నారు. వరంగల్ జిల్లాలో సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య ప్రాణత్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోశారని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరారు. గురువారం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం హుస్నాబాద్‌క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీకి అనుగుణంగా పలు గ్రామాలకు కొత్త బస్సు సౌకర్యం కల్పించాలని కోరామన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రికల్ బస్సులు నర్సాపూర్ డిపోకు కేటాయించాలన్నారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మండలాలకు గురుకులాలు, ఇతర మండలాలకు ఇంజనీరింగ్ కాలేజీలు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు మల్లేష్, మహేశ్వర్‌రెడ్డి, రాజుయాదవ్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి శ్రీరాం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి ఇన్ పేషెంట్లతో మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో టీబీ అనుమానితుల వద్ద విధిగా నమూనాలు సేకరించాలని చెప్పారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డాక్టర్లు నవీన్, హరిప్రియ, ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



మాట్లాడుతున్న సత్యనారాయణ

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన కొనసాగుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని సూచించారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో మెరుగైన ఫలితాలు రావడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

జాడలేని వాన..

రైతన్న హైరానా..!

- కమ్ముకుంటున్న కరువు ఛాయలు
- ముదురుతున్న నారుమళ్లు
- నీరులేక వెలవెలబోతున్న జలాశయాలు



ఫొటోలో ఉన్న రైతు పేరు లాలయ్య. ఈయనది మెదక్ మండలం ఖాజిపల్లి పరిధిలోని రాంజీతండా. ఈ రైతుకు 4.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో రెండు బోర్లు ఉన్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు జూలై మొదటి వారంలోనే నాట్లు వేశాడు. ఈ ఏడాది మే మొదటివారంలో నారుమళ్లు పోశాడు. ఇప్పటికీ సుమారు రెండు నెలలు కావొస్తోంది. చెప్పుకోదగ్గ వర్షాలు లేక బోరుబావుల్లో నీటి ఊటలు తగ్గిపోవడంతో దుక్కులు దున్ని వర్షాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఒక్క లాలయ్యే కాదు జిల్లాలోని రైతులంతా ఇదే రకమైన పరిస్థితిలో ఉన్నారు.



దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన రైతులు

మెదక్‌జోన్: జిల్లాలో చెప్పుకోదగ్గ సాగునీటి ప్రాజెక్టులు లేవు. 90 శాతం రైతులు బోరుబావుల మీదే ఆధారపడి వ్యవసాయం సాగిస్తారు. వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండితేనే భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీటి ఊటలు పెరుగుతాయి. అప్పుడే పంటల సాగు ముందుకు సాగుతుంది. అయితే ఈసారి జిల్లాలో ఇప్పటివరకు ఆశించిన మేర వర్షాలు పడలేదు. నారుమళ్లు (తూకం) పోశాక 25 రోజుల వరకు నాట్లు వేస్తేనే ఆశించిన దిగుబడి వస్తోందని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎక్కువ సమయం అయితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు. కాగా జిల్లాలో బోరుబావుల ఆధారంగా ఎక్కువ మంది రైతులు మే మొదటి వారంలోనే నారుమళ్లు పోసుకున్నారు. ఇప్పటికీ నెలన్నర గడిచి పోయింది. నార్లు ముదురుతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

370 ఎకరాల్లో మాత్రమే సాగు

గతేడాది జూలై మొదటివారంలో 80 శాతం రైతులు నాట్లు పూర్తి చేశారు. అయితే జిల్లాలో చెప్పుకోదగ్గ వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. జిల్లాలో ఏకైక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు అయిన ఘనపూర్‌తో పాటు కొంటూర్ చెరువు, రాయినిపల్లి, హల్దీ ప్రాజెక్టులు నీరులేక వెలవెలబోతున్నాయి. కాగా జిల్లాలో ఈ ఏడాది 3.73 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో సింహభాగం వరి 3.27 లక్షల ఎకరాల్లో సాగు కానుండగా, ఇప్పటివరకు కేవలం 370 ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అదేవిధంగా రెండో స్థానంలో పత్తి 40,619 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 30 వేల ఎకరాల్లో సాగైంది. ఆరుతడి పంటలు సైతం అంచనా మేరకు సాగు కాలేదని తెలుస్తోంది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు.



ముదిరిన నారు

స్థానికం.. ప్రత్యేకం

ప్రత్యేక అధికారుల నియామకం

మెదక్‌జోన్: స్థానిక సంస్థల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. ఈనెల 3వ తేదీతో మండల పరిషత్ అధ్యక్షులు, గురువారంతో జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికల నిర్వహణ సా ధ్యం కాకపోవడంతో మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఆయా మండలాల్లో బాధ్యతలు సైతం స్వీకరించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. తాజాగా స్థానిక సంస్థల పదవీకాలం కూడా ము గిసింది. దీంతో ప్రత్యేక అధికారుల ద్వారా పా లన సాగనుంది. ఇక అభివృద్ధి పనులు ప్రత్యేక అధికారుల సమక్షంలోనే జరగనున్నాయి. జిల్లాలోని 20 మందిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఇందులో తూప్రాన్ ఆర్డీఓ, నర్సాపూర్, మెదక్ డీఎల్‌పీఓలు కాగా మిగితా 17 మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.



చిన్నశంకరంపేట: బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విజయ్‌శేఖర్‌రెడ్డి

అధికారులపై మరింత భారం

ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారి బీజీగా ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులను స్వల్పకాలిక సాగుకు సమాయత్తం చేయడం, నూతన వంగడాలు, తెగుళ్లపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాల్సిన సమయం. ఈ సమయంలో ప్రత్యేక అధికారిగా నియమించడం రైతులకు కొంత ఇబ్బందికర పరిస్థితి. అలాగే బడులు పునఃప్రారంభమై నెల రోజులు సైతం కాలేదు. ఇటీవలే బదిలీలు, పదోన్నతులతో చాలా మంది ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. జిల్లాలో ఇప్పటికే 500 పైచిలుకు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అక్కడ సర్దుబాటు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈక్రమంలో డీఈఓకు సైతం ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ప్రస్తుత సీజన్‌లో పాడి పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇప్పటికే వెటర్నరీ శాఖలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. అలాంటిది జిల్లా వెటర్నరీ అధికారిని సైతం ప్రత్యేక అధికారిగా నియమించారు. ఇలా కొన్నిశాఖల అధికారులకు ప్రత్యేక పాలన మరింత ఇబ్బందులు తెచ్చి పెట్టే అవకాశం ఉంది.

వన మహోత్సవానికి సిద్ధం కావాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవానికి సిద్ధంగా ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మల్కాపూర్, కుసంగి, దాదాయిపల్లి గ్రామాలను సందర్శించి నర్సరీ, వాటర్‌షెడ్‌లను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీకి ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఫిట్టింగ్, ప్లాంటింగ్ ద్వారా వన మహోత్సవం పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెల నాటికి పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో ఎవరూ అలసత్వం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రియాజొద్దీన్, ఏపీఓ పాల్, ఈసీ బాల్‌రాజ్, టీఏలు లక్ష్మయ్య, గంగారం, శశికళ, అనసూజతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024– 26 విద్యా సంవత్సరాలకు గానూ పలు ట్రేడ్‌లలో అడ్మిషన్ పొందడానికి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో చేరేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అన్ని కోర్సుల్లో 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టు పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం

ఉమ్మడి జిల్లా ఏడీ ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న అధికారి ఇంద్రసేనారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఉమ్మడి మెదక్ జిల్లా సెరికల్చర్ ఏడీ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం మండలంలోని దౌలాపూర్‌లో పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు పరిశ్రమ ఉత్పత్తిలో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 4 వందల కుటుంబాలు మల్బరీ సాగు చేస్తూ నెలకు యాభై వేల నుంచి లక్ష వరకు ఆదాయం సంపాదిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 1,127 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు పట్టు పరిశ్రమ ద్వారా జీవనోపాధి కలుగుతుందన్నారు. ఒక యూనిట్‌కు నాలుగు లక్షల 50 వేలు ఉంటుందని, సబ్సిడీ రెండు లక్షల 92 వేలు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ మల్లేశం, గజ్వేల్ ఏఎంసీ వైస్ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన యునిసెఫ్ బృందం

హుస్నాబాద్: స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం యునిసెఫ్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రోడ్డు భద్రత విషయంలో విద్యార్థులకు, పిల్లలకు కల్పించాల్సిన అవగాహన అంశాలపై బృందం సభ్యులు మంత్రికి వివరించారు. అనంతరం బృందం సభ్యులను మంత్రి సన్మానించారు.

'గౌరవెల్లి'కి నిధులివ్వండి

- ప్రాజెక్టు కెనాల్ పనులను వేగిరం చేయండి
- సీఎం రేవంత్‌కు చాడ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి



సీఎం రేవంత్ రెడ్డికి పుస్తకం అందిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలో సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వరద కాలువకు ఇందిరా కాలువగా నామకరణం చేశారని తెలిపారు. గౌరవెల్లి, గండిపెల్లి, తోటపల్లి లిఫ్ట్ కెనాల్‌కు 2007లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ కెనాల్ పనులు 90 శాతం పూర్తి కాగా, గత సీఎం కేసీఆర్ వరద కాలువ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం పెంచినందు వల్ల 80 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. దీంతో గూడాటిపల్లి, తెనుగుపల్లి, మద్దెలపల్లి అనేక గిరిజన తండాలు ముంపునకు గురయ్యాయన్నారు. పునరావాస ప్యాకేజీ కింద నిర్వాసితులకు, రైతులకు, ప్రజలకు చెల్లించాల్సిన డబ్బులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత ఏడాది రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ చేస్తామని ఆశించినా అమలు కాలేదన్నారు. నిర్వాసితులకు రావాల్సిన ప్యాకేజీ రానందున దిక్కుతోచని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారని చాడ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి గౌరవెల్లి, గండిపెల్లి, తోటపల్లి రిజర్వాయర్ ముంపు బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు చాడ తెలిపారు.

పచ్చిరొట్టతో పోషకాల పెంపు

డీఏఓ గోవింద్

నిజాంపేట(మెదక్): పచ్చిరొట్ట పంటలను భూమిలో కలియదున్నడం వల్ల పోషకాలు పెరిగి అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నందిగామలో జీలుగ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. అలాగే భూమి తన నైసర్గిక స్వరూపాన్ని కోల్పోయి నిస్సారవంతంగా తయారవుతుందని వివరించారు. అనంతరం పంటలు, ఎరువుల యజమాన్య పద్ధతుల గురించి రైతులతో చర్చించా రు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీలత, కావేరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జీలుగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

హామీలు వెంటనే అమలు చేయాలి

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇస్తానన్న రూ.2,500, నవ వధువుకు తులం బంగారం పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే కళాశాలకు వెళ్లే ప్రతి ఆడపిల్లకు స్కూటీ, రూ. 5 లక్షల విద్యార్థి హామీ కార్డులు అందజేయాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు లావణ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



విద్యాసంస్థల మూతతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

నీట్‌ను రద్దు చేయాలి

మెదక్ కలెక్టరేట్: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ గురువారం జిల్లాలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజయ్ కుమార్, దినకర్, నిరంజన్ మాట్లాడుతూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో మంత్రి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నెట్, నీట్‌లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీకి కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని మండిపడ్డారు. నీట్ కౌన్సెలింగ్ వెంటనే ఆయాలని, కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయురాలిని హత్తుకొని విలపిస్తున్న విద్యార్థులు

మేడం.. మీరు వెళ్లొద్దు

చేగుంట(తూప్రాన్): కొందరూ ఉపాధ్యాయులు విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ వారికి విద్యాబుద్ధులు చెబుతుంటారు. వారు బదిలీపై వెళ్తుంటే విద్యార్థులు కంటనీరు పెడుతుంటారు. అలాంటి ఘటనే మండలంలోని పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు రజిత 12 ఏళ్లుగా తండాలో పనిచేసి విద్యార్థులకు మెరుగైన బోధన అందించారు. ఇటీవల బదిలీపై వెల్దుర్తి మండలానికి వెళ్లారు. గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించగా విద్యార్థులు మేడం.. మీరు వెళ్లొద్దు అంటూ హత్తుకొని విలపించారు. ఈక్రమంలో ఉపాధ్యాయురాలు సైతం భావోద్వేగానికి లోనయ్యారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


అజయ్‌

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మెదక్‌ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 3న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో చిలప్‌చెడ్‌ మండలం గౌతాపూర్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థి అర్‌.అజయ్‌(ఏడవ తరగతి) అండర్‌–12 లాంగ్‌జంప్‌ పోటీల్లో బంగారు పతకం సాధించి, ఈ నెల 7న హైదరాబాద్‌ గచ్చిబౌలిలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యాడు. అదే విధంగా అజయ్‌ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు. లాంగ్‌ జంప్‌లో ఆర్‌. జగదీశ్‌, పరుగు పందెంలో హరీశ్‌, జీ.హారిక, సాయికిరణ్‌ ప్రతిభ కనబర్చారు. గురువారం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వ్యాయమ ఉపాధ్యాయుడు సత్యంని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఎల్లేశ్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా గురువారం జిన్నారంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌లను నివారించాలి

పీసీబీ అధికారులకు ఫిర్యాదు


వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌లతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, క్రషర్‌లను నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాదారం మాజీ సర్పంచ్‌ సురేందర్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. గురువారం పీసీబీ అధికారులకు గ్రామ బీఆర్‌ఎస్‌ నాయకులు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్‌ సురేందర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అక్రమ బ్లాస్టింగ్‌లతో కాలుష్యం తీవ్రంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయ్‌, గణేశ్‌, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా కోరుతూ..

మంత్రి దామోదరకు అభ్యర్థుల వినతి

సంగారెడ్డి: డీఎస్సీ పరీక్షను మూడు నెలలు వాయిదా వేయాలని కోరుతూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాకు గురువారం సంగారెడ్డి పట్టణ కేంద్రంలో డీఎస్సీ అభ్యర్థులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షను మూడు నెలలు వాయిదా వేసి, మెగా డీఎస్సీగా 25 వేల పోస్టులతో భర్తీ చేయాలని తెలిపారు. పరీక్షను ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఉన్నందున అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం లేదన్నారు. దీంతోపాటు గ్రూప్‌–2, 3 పోస్టులు పెంచుతూ గ్రూప్‌–2 పరీక్షను వాయిదా వేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అభ్యర్థులు ఆంజనేయులు, అమర్‌, నరేశ్‌, నవీన్‌, మహేశ్‌, రేణుక, మౌనిక, స్వాతి, సురేఖ, అఖిలేశ్‌, రమేశ్‌, వినోద్‌, గోపాల్‌, రాజేశ్‌, ఇస్మాయిల్‌, తదితరులు ఉన్నారు.

65 ఏళ్లు దాటితే ఇంటికే..

- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 16 మంది టీచర్లు, 110 మంది ఆయాల గుర్తింపు
- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణలో అధికార యంత్రాంగం



నారాయణరావుపేట అంగన్‌వాడీ కేంద్రం

సిద్దిపేటరూరల్‌: అంగన్‌వాడీలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలతోపాటు పలు రకాల మార్పులు చేర్పులకు శ్రీకారం చుడుతోంది. ఈ మేరకు ఇటీవల పాఠశాలల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌ విద్యను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇదే తరుణంలో మరోసారి అంగన్‌వాడీలపై ప్రభుత్వం మార్పులు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లుగా, ఆయాలుగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న వారిలో 65 ఏళ్లు నిండిన వారికి ఉద్యోగ విరమణను అమలు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆధార్‌ కార్డుల ఆధారంగా వయస్సు..

జిల్లాలో మొత్తం 5 ప్రాజెక్టులు ఉండగా 1150 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్‌కు సంబంధించి ప్రకటించిన ఉత్తర్వులను జూలై 1వ తేదీ నుంచి జిల్లాలో అమలు చేశారు. వీరికి అటెండెన్స్‌ నమోదు చేయడం గాని, వేతనం చెల్లించడం గాని నిలిపివేయాలని సీడీపీవోలు, సూపర్‌ వైజర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వారు గజ్వేల్‌లో 10 మంది, హుస్నాబాద్‌ 3, చేర్యాల ఒకరు, దుబ్బాక ఒకరు మొత్తం 16 మంది టీచర్లు, 110 మంది ఆయాలు ఉన్నారు. వీరికి జీతాలు అందించే సమయంలో వారు అందించిన ఆధార్‌ కార్డుల ఆధారంగా వయస్సును లెక్కించి ప్రభుత్వానికి నివేదించారు.

టీచర్లకు రూ.లక్ష.. ఆయాలకు రూ.50 వేలు

ప్రభుత్వం రిటైర్మెంట్‌ పొందుతున్న టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేల చొప్పున బెనిఫిట్స్‌ అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వారికి బెనిఫిట్స్‌ను అందించనున్నారు. జూలై నెల నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



ప్రభుత్వం 65 ఏళ్లు కలిగిన వారిని రిటైర్మెంట్‌ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మా వద్ద ఉన్న ఆధారాలతో ప్రభుత్వానికి నివేదికను అందించాం. ఖాళీగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
శారద, జిల్లా సంక్షేమశాఖ అధికారి

కేంద్రాల నిర్వహణ ప్రశ్నార్థకం..

టీచర్లు, హెల్పర్లు వెళ్లిపోవడంతో ఆయా కేంద్రాలను ఎవరు నిర్వహించాలన్న దానిపై స్పష్టత రావడం లేదు. ఇప్పటికే జిల్లాలో కొన్ని కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేరు. దీంతో టీచర్లే ఆయాలుగా వ్యవహరించగా, కొన్ని చోట్ల ఆయాలే టీచర్లుగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరిన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. పూర్తి స్థాయిలో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఖాళీ స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో కేంద్రాల పరిధిలో సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది.

యువతను రెచ్చగొడుతున్న హరీశ్‌రావు

- ఉద్యోగాలు ఇవ్వలేదనడం సరికాదు
- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి


మాట్లాడుతున్న నర్సింహా రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు యువతను రెచ్చగొడుతున్నారని, ఈ వ్యాఖ్యలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న వార్తలు పత్రికల కథనాలు చూపుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇప్పటికే ఆరు గ్యారెంటీ పథకాల్లో నాలుగు పథకాలు అమలు చేసిందన్నారు. అదేవిధంగా రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 లోపు చేస్తామని, పలు ఉద్యోగాల నోటిఫికేషన్‌ కూడా జారీ చేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఇతర దేశాలకు వెళ్లి పెట్టుబడుల కోసం రూ.వేలాది కోట్లు రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. సీఎం పైన ఎమ్మెల్యే హరీశ్‌ రావు, కేటీఆర్‌ ఇద్దరూ చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్‌ను పటాన్‌చెరుకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్‌ సంజీవరెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ డైరెక్టర్‌ అతిక్‌, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్‌ మోరే, అమర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

పాఠశాల ఆడిట్‌ను వాయిదా వేయాలి

పీఆర్టీయూటీఎస్‌ ఆధ్వర్యంలో వినతి


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూటీఎస్‌ నాయకులు

మెదక్‌ కలెక్టరేట్‌: ఈనెల 15, 16న నిర్వహించే పాఠశాలల ఆడిట్‌ను వాయిదా వేయాలని పీఆర్టీయూటీఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం మెదక్‌ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కార్యాలయ ఏడీ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరుస సెలవుల వస్తున్న దృష్ట్యా ఆడిట్‌ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని తెలిపారు. ఆడిట్‌ ముందు రెండు రోజులు సెలవులు ఉన్నాయని, ఆడిట్‌ తర్వాత ఒక రోజు సెలవు ఉండటంతో ఇతర గ్రామాలకు వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఏడీ తెలిపారన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల నాయకులు పంతులు రాజు, హరిబాబు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్‌రూరల్‌: వరల్డ్‌ ఎన్విరాన్మెంట్‌ డే సందర్భంగా జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో నిర్వహించిన పోయెట్రీ, పోస్టర్‌ మేకింగ్‌ పోటీల్లో గజ్వేల్‌లోని సెయింట్‌ జోసెఫ్‌ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. గురువారం సిద్దిపేటలోని టీటీసీ భవనంలో జరిగిన పోటీల్లో సెయింట్‌ జోసెఫ్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా.. వీరిలో 8వ తరగతి విద్యార్థిని సిరిచందన 'భూమి పునరుద్ధరణ–కరువు తట్టుకునే శక్తి' అనే అంశంపై నిర్వహించిన పోయెట్రీలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిస్టర్‌ సుష్మ, కరస్పాండెంట్‌ జోసెఫ్‌ మేరీలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలు, కళారంగంలో రాణించి తమదైన శైలిని చాటాలన్నారు. సిరి చందనతోపాటు మిగితా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటడంపై హర్షం వ్యక్తం చేశారు.

దొంగల హల్‌చల్‌

- తాళం వేసిన ఇళ్లలో చోరీలు
- రూ.2.50 లక్షల నగదు, వెండి అపహరణ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కొండపాక(గజ్వేల్‌): ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ కథనం మేరకు.. కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన కాట మౌనిక గ్రామంలోనే ఆంధ్రా బ్యాంక్‌ (బీవో) రిటైలర్‌గా పని చేస్తుంది. భర్త వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీన మౌనిక పని నిమిత్తం పొన్నాలలోని తల్లిగారింటికి వెళ్లింది. భర్త శేఖర్‌ గురువారం తెల్లవారుజామున పొలం వద్దకుగ గేదె పాలు పితకడానికి వెళ్లాడు. దీన్ని గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి రూ.50 వేల నగదుతోపాటు 18 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితురాలు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.2 లక్షలు చోరీ..

పాపన్నపేట(మెదక్‌): మండల పరిధిలోని కుర్తివాడ గ్రామంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు ముప్పారం గంగయ్య కథనం మేరకు.. ఈ నెల 2న ఇంటికి తాళం వేసి చుట్టాల ఇంటికి వెళ్లాం. తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని రూ.2 లక్షలు, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేశ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఊర కుక్కల దాడిలో దుప్పి మృతి

హవేళిఘణాపూర్‌(మెదక్‌): ఊర కుక్కలు దాడిలో అడవి దుప్పి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి చెరువు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లింగ్సాన్‌పల్లి అటవీ సమీపంలో ఉన్న చెరువులోకి దుప్పి నీరు తాగేందుకు రాగా ఊర కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని వెటర్నరీ అధికారి లక్ష్మణ్‌ను అడుగగా.. ఊర కుక్కలు దాడి చేసినట్లు ధ్రువీకరించగా.. బీట్‌ ఆఫీసర్‌ కిష్టయ్య మాత్రం పోస్టుమార్టం వచ్చేంత వరకు తెలియదని పేర్కొన్నారు.

ఉబర్‌ రైడ్‌కి వెళ్లొస్తానని..

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరుటౌన్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్‌ మండలంలోని బీరంగూడలోని ప్రణీత్‌ ప్రణవ్‌ నైట్‌ వుడ్స్‌లో నివాసం ఉంటున్న రాకేశ్‌ రెడ్డి 3 తేదీన బర్‌ బైక్‌ రైడింగ్‌కి వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాలేదు. భార్య మానస ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూమ్‌ నుంచి వెళ్లిన వ్యక్తి..

ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన దిలీప్‌ కుమార్‌ రెండు నెలల కిందట గ్రామస్తులతో వచ్చి పాశమైలారంలో ఉంటూ పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో పని చేస్తున్నాడు. జూన్‌ 20 వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో గ్రామస్తులతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు బయలుదేరాడు. కానీ దిలీప్‌ కుమార్‌ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. అన్న అదృశ్యంపై సోదరుడు ధర్మేందర్‌ కుమార్‌ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ల్యాబ్‌ టెక్నీషియన్‌ ఆత్మహత్య


మహేశ్‌ (ఫైల్‌)

చిన్నకోడూరు(సిద్దిపేట): ల్యాబ్‌ టెక్నీషియన్‌ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నెమలి భాగ్యలక్ష్మి–కిష్టయ్య దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కిష్టయ్య కులవృత్తితోపాటు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడు మహేశ్‌ (31)కు నిహారికతో వివాహం జరుగగా సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. గత నెల భార్య పని నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్తాపం చెందిన మహేశ్‌ బుధవారం రాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబీలకు సమాచారం ఇచ్చి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. ఆన్‌లైన్‌లో మోసపోయి రూ. 3 లక్షలకు పైగా నష్టపోయాడని, ఆ విషయం ఇంట్లో చెప్పలేక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పలువురు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి..

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు కథనం మేరకు.. మండలంలోని రేజింతల్‌ గ్రామానికి చెందిన బేగరి నర్సింలు(60) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. రెండు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భాగమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త..

కౌల్దారం(నర్సాపూర్‌): భార్యాభర్తల మధ్య గొడవ భర్త ఆత్మహత్యకు దారి తీసింది. ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. చిలప్‌చెడ్‌ మండలం చిట్కుల్‌ గ్రామానికి చెందిన బోయిని నారాయణ చిన్న కుమారుడు యాదగిరి(35)కి టేక్మాల్‌ మండల్‌ ధన్నారం గ్రామానికి చెందిన మానసను ఇచ్చి 20 నెలల కిందట వివాహం చేశారు. వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సైతం గొడవ జరగడంతో మానస అన్నలు కొడపాక యాదగిరి, రమేశ్‌ చిట్కుల్‌ గ్రామానికి వచ్చి బావ యాదగిరిని దుర్భాషలాడి, దాడి చేశారు. రాత్రి ఇంట్లో అందరూ నిద్రించగా, ఉదయం లేచి చూసేసరికి యాదగిరి కనిపించలేదు. వెతుకుతున్న క్రమంలో ఎనగండ్ల గ్రామ శివారులో యాదగిరి చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితుల కళ్లెదుటే నీటిలో మునిగి..

ఏడుపాయల్లో యువకుడు మృతి


రాజు (ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): వనదుర్గా ప్రాజెక్టులో మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఏడుపాయల్లో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై నరేశ్‌ కథనం మేరకు.. కొడిపల్లి గ్రామానికి చెందిన బర్ల రాజు (28) యూట్యూబ్‌ ఛానల్‌ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. దుర్గమ్మ దర్శనం అనంతరం స్నేహితులతో కలిసి వన దుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. స్నేహితులు ఆనకట్టపై ఉండగా రాజు స్నానం కోసం ప్రాజెక్టులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో ప్రాజెక్టులో వెతికించగా రాజు మృతదేహం లభ్యమైంది. తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వర్షాధారం వద్దు.. వరికే మొగ్గు

- వానలు రాకుంటే నష్టపోతామంటున్న రైతులు
- భూములను బీడుగానే వదిలేస్తున్న వైనం
- వరి సాగుకు ఎక్కువగా ఆసక్తి
- ఆధునిక యంత్రాలతో పనులు


దుబ్బాకలో వరి నాట్లు వేసిన రైతులు

దుబ్బాకరూరల్‌: వర్షాకాలం వచ్చిందంటే ఒకప్పుడు ఎక్కువ శాతం రైతులు వర్షాధార పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది, పెసర, ఇతర పంటలను సాగు చేసే వారు. కాలం మారుతున్న తరుణంలో రైతులు ఎక్కువగా వరి పంటలను సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఏదో ఒక్క పంట సాగు చేసేందుకు రైతులు ప్రతీ బీడు భూమిని దున్నేవారు. కానీ ప్రస్తుతం రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. వర్షం సమయానికి పడకపోవడంతో నష్టపోతామని ఆలోచిస్తున్నారు. భూములను దున్నకుండా అలాగే వదిలి వేయండతో దాంట్లో ముళ్లపొదలు, చెట్లు పెరుగుతున్నాయి.

దుబ్బాక, దౌల్తాబాద్‌, తొగుట, చేగుంట, భూంపల్లి, రాయపోల్‌ మండలాల్లో వరిని ఎక్కువగా సాగు చేస్తారు. వర్షాధార పంటలను తక్కువ స్థాయిలో సాగు చేస్తారు. మిరుదొడ్డి మండలంలో వరి, వర్షాధార పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలోని మిగతా మండలాల్లో తక్కువ స్థాయిలోనే వర్షాధార పంటలను సాగు చేస్తారు.

వేయకపోవడానికి కారణం

- వర్షాధార పంటలు వేసినప్పటి నుంచి మొదలుకొని, పంట చేతికందె వరకు రైతులు కష్టపడాల్సి వస్తుంది. పంట చెల్లో గడ్డిని తీసి వేయడం, ఒక వేళ వర్షాలు లేకపోతే పంట ఎండిపోయి నష్టం వస్తుంది.
- మరో వైపు కోతులు, అడవి పందుల బెడద, ఇతర జీవరాశులు పంటలను నాశనం చేస్తాయనే భయంతో రైతులు వర్షాధార పంటలు వేయడం లేదు.
- కూలీల కొరత, వర్షాధార పంటలను కోయడం కోసం ఇంకా ఆధునిక యంత్రాలు రాకపోవడం మరో కారణంగా చెబుతున్నారు.

వరి సాగుకు మొగ్గు

- బోరు బావులు ఉన్న ప్రతీ రైతు వరి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. వర్షాకాలంలో వరి పంటలను సాగు చేయడానికి ఎక్కువ భూమిని దున్నుతారు.
- కూలీల కొరత ఎక్కువగా ఉండదు. గతంలో వరి పంటలను కూలీల ద్వారా నాట్లు వేసేవారు. ప్రస్తుతం నాట్లు వేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఎరువులు చల్లడానికి యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.
- ఒక్కప్పుడు నాట్లు వేశాక కూలీలతో కలుపు తీసేవాళ్లు. వరి పంటలో గడ్డి మొలకెత్తకుండా కలుపు మందును ముందుగానే చల్లుతున్నారు. దీంతో కూలీల కొరత తప్పింది.
- పంట చేతికొచ్చె సమయానికి వరికోత మిషన్‌ (హార్వెస్టర్‌) అందుబాటులోకి వచ్చింది. రైతులు ఎక్కువ శాతం భూమిని దున్ని నాట్లు వేస్తున్నారు. వరి ధాన్యాన్ని నేరుగా ట్రాక్టర్లలో నింపి మార్కెట్‌కు తరలిస్తున్నారు.

మార్కెట్‌లో అన్ని రకాల విత్తనాలు



గతంలో రైతులు వర్షాకాలం వచ్చిందంటే ఎక్కువగా వర్షాధార పంటలపై ఎక్కువ శ్రద్ధ చూపేవారు. మూడేళ్ల నుంచి వర్షాధార పంటలపై శ్రద్ధ చూపడం లేదు. వర్షాకాలంలో ఎక్కువగా వరి పంటనే సాగు చేస్తున్నారు. మొక్కజొన్న,జొన్న, పత్తి, కంది, పెసర, బొబ్బెర, ఇతర వర్షాధార పంటలను సాగు చేయడం లేదు. రైతులకు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.
–ప్రవీణ్‌కుమార్‌, మండల వ్యవసాయాధికారి

వర్షాలు కురువకపోతే..



ఒకప్పుడు ఎక్కువగా వర్షాధార పంటలు వేసే వాళ్లం. రెండు, మూడేళ్లుగా వర్షాధార పంటలు వేయడం లేదు. కూలీల కొరత ఓ వైపు, కోతుల బెడద, అడవి పందుల బెడద మరో వైపు ఉండటంతో వర్షాధార పంటలు వేయడం లేదు. వర్షాలు కురువకపోతే పంటలు ఎండి పోయే అవకాశం ఉంది. పంటలు కోయడానికి ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాలేదు.
– జోగయ్య, రైతు, దుబ్బాక

వరి ఎక్కువగా సాగు..



వర్షాకాలంలో ఎక్కువగా వరి సాగు చేస్తాం. యంత్రంతో వరి నాట్లు వేయిస్తున్నాం. గతంలో కూలీలతో కలుపు తీసేవాళ్లం. ప్రస్తుతం కలుపు నివారణకు ముందుగానే గడ్డి మందును చల్లుతున్నాం. బోర్‌ బావులు ఉన్న వారు ఎక్కువగా వరి పంటను సాగు చేస్తారు. పంటను చివరికి కోత మిషన్‌ (హార్వెస్టర్ల)తో కోయిస్తున్నాం. వడ్లను ట్రాక్టర్లలో నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్నాం. కూలీలతో అవసరం లేకుండా పోయింది.
–రామయ్య, రైతు, దుబ్బాక

టిప్పర్‌ ఢీకొని రైతు మృతి


సంజీవరెడ్డి (ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): టిప్పర్‌ ఢీకొని రైతు మృతి చెందాడు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామంలోని టోల్‌గేట్‌ వద్ద గురువారం జరిగింది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గురువారం ఉదయం నర్సాపూర్‌ నుంచి అన్నారం వైపు మట్టి టిప్పర్‌ వాహనం గుమ్మడిదలలోని టోల్‌ గేట్‌ వద్దకు రాగానే డ్రైవర్‌ నిద్రమత్తులో వేగంగా నడిపాడు. టోల్‌గేట్‌ సమీపంలోనే గుమ్మడిదల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్‌ నాయకుడు, రైతు సరెడ్డిగారి సంజీవరెడ్డి(65) విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద కరెంట్‌ సరఫరాను పరిశీలిస్తున్న సమయంలో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంజీవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు. నర్సాపూర్‌ నుంచి అన్నారం వైపు మట్టి టిప్పర్‌లు నిత్యం తిరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్‌లు తిరుగుతున్నా రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్‌: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని కడప జిల్లాకు చెందిన వేణుగోపాల్‌ (64)బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌ సమీపంలోని ఓ ఫార్మా కంపెనీ వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడు నివాసం ఉండే మొదటి అంతస్తు నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని జయంత్‌ గురువారం వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.